
MRR 69 TV

అవినీతిపై అక్షర సమరం

మన అంకుశం

సంచలన సాయంకాలం దినపత్రిక




ఎడిటర్ : మచ్చా రామలింగారెడ్డి | సంపుటి : 5 | సంచిక : 349 | సోమవారం 10 నవంబర్ 2025 | పేజీలు : 4 | వెల : 3/-



# గోడౌన్లు సిద్ధం చేయాలి

- ధాన్యం కొనుగోలుపై మంత్రి నాదెండ్ల సమీక్ష...
- రైస్ మిల్లర్లతో పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సమీక్ష
- ఖరీఫ్ ధాన్యం నిల్వ కోసం గోడౌన్లు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశం
- మొత్తం 34 లక్షల మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యం నిల్వకు ఏర్పాట్లు
- డ్రైయర్లు ఉన్న మిల్లులకే ప్రాధాన్యత ఇవ్వాలని సూచన
- గోడౌన్ల వద్ద నిఘా కోసం ఏఐ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశం
- మిల్లర్లు 1:2 నిష్పత్తిలో బ్యాంక్ గ్యారంటీలు సమర్పించాలని స్పష్టం

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

2025%-%26 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు, కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) నిల్వపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. ధాన్యం సేకరణ అనంతరం బియ్యాన్ని నిల్వ చేసేందుకు అవసరమైన గోడౌన్లను ముందుగానే సిద్ధం చేసుకోవాలని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలోని తన ఛాంబరులో రైస్ మిల్లర్ల సంఘం ప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గత ఏడాది కూటమి ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తూ ధాన్యం కొనుగోళ్లలో చారిత్రాత్మక విజయం సాధించిందని గుర్తు చేశారు. అదే స్ఫూర్తితో ఈ సీజన్‌లో కూడా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖకు 20 లక్షల మెట్రిక్ టన్నులు, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా - మిగతా3లో

# 3 పార్టీలకు టెన్షన్




**భారీగా రంగంలోకి బెట్టింగ్ రాయుళ్లు**

**జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరుగుతున్న ఉప ఎన్నిక ఆసక్తిని కలిగిస్తోంది**

**తెలంగాణ మాత్రమే కాదు ఏపీ ప్రజలు కూడా ఈ ఎన్నికను ప్రత్యేకంగా చూస్తున్నారు.**

**ఏ పార్టీ ఎలాంటి హామీలు ఇచ్చింది?**

**క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎలా ఉంది?**

**అనే అంశాల మీద తెలంగాణ వారి కంటే, ఏపీ ప్రజలు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు.**

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ నగరంలోని జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో జరుగుతున్న ఉప ఎన్నిక ఆసక్తిని కలిగిస్తోంది. తెలంగాణ మాత్రమే కాదు ఏపీ ప్రజలు కూడా ఈ ఎన్నికను ప్రత్యేకంగా చూస్తున్నారు. ఎందుకంటే ఈ నియోజకవర్గంలో ఏపీ నుంచి వచ్చిన వారు అధికంగా ఉన్నారు.. అందువల్లే ఎవరు గెలుస్తారు? ఎవరికి ఎక్కువ ఓట్లు పడతాయి? ఏ పార్టీ ఎలాంటి హామీలు ఇచ్చింది? క్షేత్రస్థాయిలో పరిస్థితి ఎలా ఉంది? అనే అంశాల మీద తెలంగాణ వారి కంటే, ఏపీ ప్రజలు ఎక్కువగా ఆసక్తి చూపిస్తున్నారు.ఏపీ నుంచి చాలామంది ఇప్పటికే జూబ్లీహిల్స్ ప్రాంతానికి వచ్చారు. అలాగని వారు సర్వే సంస్థలలో -

# మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అజారుద్దీన్



టీమిండియా మాజీ కెప్టెన్, తెలంగాణ మంత్రి అజారుద్దీన్ ఈరోజు తన శాఖల బాధ్యతలు స్వీకరించారు. సచివాలయంలోని తన ఛాంబర్‌లో కుటుంబ సభ్యుల సమక్షంలో, ముస్లిం మత పెద్దల ప్రార్థనల మధ్య ఆయన బాధ్యతలు చేపట్టారు. ఆయనకు కేటాయించిన మైనార్టీల సంక్షేమం, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖల మంత్రిగా అధికారికంగా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా మంత్రి అజారుద్దీన్ మాట్లాడుతూ, తనపై ఎంతో నమ్మకం ఉంచి ఈ గురుతర బాధ్యతలు అప్పగించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. సీఎం తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకునేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన అజారుద్దీన్‌కు పలువురు అధికారులు, నేతలు, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు. గత నెల 31వ తేదీన అజారుద్దీన్ మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసిందే. రాజ్‌భవన్‌లో ఆయన చేత గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించారు. అనంతరం నవంబర్ 4వ తేదీన అజారుద్దీన్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మైనార్టీ సంక్షేమ, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ శాఖలను అప్పగించారు.

# క్వాంటం కంప్యూటింగ్ సెంటర్‌గా ఏపీ

- బిలియన్ డాలర్ల పెట్టుబడులే లక్ష్యం
- ఏపీ క్యాబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది.
- రాష్ట్రంలో రూ.లక్ష కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్
- క్వాంటం కంప్యూటింగ్‌కు ఏపీ కేంద్రంగా మారబోతోంది
- ఒక బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఆకర్షించడమే లక్ష్యం
- 1 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించడమే క్వాంటం కంప్యూటింగ్ మిషన్ అమలు లక్ష్యం



**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ క్యాబినెట్ ఇవాళ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రంలో రూ.లక్ష కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలకు ఏపీ క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దాదాపు మూడున్నర గంటల పాటు సాగిన ఈ మంత్రివర్గ సమావేశంలో.. అజెండాలోని 70 అంశాలపై చర్చించారు. క్యాబినెట్ భేటీ ముగిసిన అనంతరం సమావేశం లో తీసుకున్న నిర్ణయాలను మంత్రి పార్థసారథి మీడియాకు వెల్లడించారు. క్వాంటం కంప్యూటింగ్ సంస్థలు, సాంకేతిక నిపుణులు, క్వాంటం కంప్యూటింగ్ విడిభాగాల సంస్థలకు ఏపీ కేంద్రంగా మారబోతోందని మంత్రి చెప్పారు. ఒక బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఆకర్షించడమే క్వాంటమ్ కంప్యూటింగ్ మిషన్ లక్ష్యమని, భారీగా స్టార్టప్‌లు రాష్ట్రానికి వస్తాయని అంచనా వేస్తున్నట్లు చెప్పారు. దాదాపు లక్ష కోట్ల పెట్టుబడులు వచ్చే ప్రతిపాదనలను ఏపీ క్యాబినెట్ ఆమోదం క్వాంటం కంప్యూటింగ్ విధానానికి క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ నేషనల్ క్వాంటం మిషన్‌తో మేధావులను అనుసంధానించుకుంటూ సాగే విధానం క్వాంటం కంప్యూటింగ్ -

# 19న పుట్టపర్తికి ప్రధాని మోదీ రాక

**సత్యసాయి మహాసమాధి దర్శనానికి వచ్చే భక్తులకు సౌకర్యాలు కల్పించండి**

**సత్యసాయిబాబా శత జయంతి వేడులపై సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు**



**అంకుశం ప్రత్యేక ప్రతినిధి అమరావతి**

శ్రీసత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ నెల 19న పుట్టపర్తికి ప్రధానమంత్రి నరేంద్రమోదీ, 22వ తేదీన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రానున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాష్ట్రపతి సహా వివిధ ప్రముఖులు హాజరుకానున్న దృష్ట్యా ఎలాంటి అవాంతరాలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సత్యసాయిబాబా జయంతి వేడుకల నిర్వహణపై సచివాలయంలో మంత్రులు, సీఎస్ విజయానంద్, అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. పుట్టపర్తికి ప్రముఖులు రానున్న నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని, పట్టణాన్ని సుందరంగా అలంకరించాలని సీఎం సూచించారు. ఏర్పాట్ల పర్యవేక్షించేందుకు మంత్రుల కమిటీ పుట్టపర్తిలో పర్యటించాలని ఆదేశించారు. శ్రీ సత్యసాయి శత జయంతి ఉత్సవాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నందుకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని మంత్రులకు సీఎం దిశానిర్దేశం చేశారు. సత్యసాయిబాబా మహా సమాధి దర్శన నిమిత్తం పుట్టపర్తి నిలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు - మిగతా3లో

# ప్రజా కవి అందెశ్రీ అస్తమయం

**అంకుశం ప్రత్యేక ప్రతినిధి మద్దూరు (ధూళిమిట్ట )**

తెలంగాణ రాష్ట్ర గీత రచయిత, ప్రజా కవి, గాయకుడు డాక్టర్ అందెశ్రీ గుండెపోటుతో సికింద్రాబాద్ గాంధీ దవాఖానాలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అందెశ్రీ((64)) మృతితో ఆయన స్వగ్రామమైన సిద్ధిపేట జిల్లా మద్దూరు మండలం రేబర్తి గ్రామంలో విషాద ఛాయలు - మిగతా3లో

- రేబర్తిలో అలుముకున్న విషాద ఛాయలు
- 'జయ జయహే తెలంగాణ' గీత రచయిత అందెశ్రీ ఇకలేరు
- హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి
- ఆయన రాసిన 'జయ జయహే తెలంగాణ'కు రాష్ట్ర గీతంగా గుర్తింపు



# క్వాంటం కంప్యూటింగ్ సెంటర్‌గా ఏపీ

-మొదటిపేజీ తరువాయి

విడిభాగాలు తయారు చేసే సంస్థలు, నిపుణులకు కేంద్రంగా ఏపీ క్వాంటం కంప్యూటింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం వల్ల, స్టార్టప్‌లు పెద్దఎత్తున రాష్ట్రానికి వస్తాయని ఆశాభావం

1 బిలియన్ డాలర్ల పెట్టుబడులను ఆకర్షించడమే క్వాంటం కంప్యూటింగ్ మిషన్ అమలు లక్ష్యం

5 వేల మందికి పైగా నైపుణ్యం కలిగిన నిపుణులు రాష్ట్రానికి రాక

రాష్ట్రవ్యాప్తంగా డిజిటల్ అనుసంధాన స్పేర్ వర్క్ స్టేషన్లు ఏర్పాటుకు ఆమోదం

ప్రతి మండలంలో 20 నుంచి 30 వర్క్ స్టేషన్లను ఏర్పాటు చేయాలని నిర్ణయం

వర్క్ స్టేషన్లను ఏర్పాటు చేసే వారికి ప్రభుత్వ ఆర్థిక సాయం

విశాఖలో పలు ఐటీ సంస్థల ఏర్పాటు ప్రతిపాదనలకు మంత్రి వర్గం ఆమోదం

విశాఖలో రియాల్టీ లిమిటెడ్.. 30 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐటీ పార్క్ ఏర్పాటుకు ఆమోదం

విశాఖలో రహేజా సంస్థ పరిశ్రమ ఏర్పాటుకు మంత్రి వర్గం ఆమోదం

విశాఖలో రుషికొండ, కాపులుప్పాడలో పలు పరిశ్రమల ఏర్పాటుకు ఆమోదం

తిరుపతి, ఓర్వకల్‌లో పలు పరిశ్రమల ఏర్పాటుకు మంత్రి వర్గం ఆమోదం

ఓర్వకల్లు డ్రోన్ సిటీలో 50 ఎకరాల్లో డెడికేటెడ్ డ్రోన్ ఇండస్ట్రియల్ ఏర్పాటుకు ఆమోదం

బిర్లా గ్రూప్‌కు నెల్లూరులో ఫైబర్ సిమెంట్ ప్లాంట్ ఏర్పాటు కోసం భూమి కేటాయింపు

ఓర్వకల్లులో సిగాచి ఇండస్ట్రియల్ లిమిటెడ్ సింథటిక్ ఆర్గానిక్ ప్లాంట్ కోసం 100 ఎకరాల భూమి కేటాయింపు

అనకాపల్లి జిల్లాలో డోస్కో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు 150 ఎకరాల భూమి కేటాయింపు

కృష్ణా జిల్లా బాపులపాడులో 40 ఎకరాల్లో వేద ఇన్నోవేషన్ పార్క్ ఏర్పాటుకు ఆమోదం

సుగుణ గ్రూప్ ఆధ్వర్యంలో అనంతపురంలో టీఎంటీ బార్స్ తయారు చేసే ప్లాంట్ కోసం 300 ఎకరాల భూమి కేటాయింపు

అసైన్డ్ భూముల (బదిలీ నిషిద్ధ) చట్టం సవరణ బిల్లుకు ఆమోదం

అసైన్డ్ భూములను అవసరాలకోసం 99 ఏళ్లపాటు లీజుకు ఇచ్చేందుకు వీలు కల్పిస్తూ సవరణ

విమానాశ్రయ అభివృద్ధి సంస్థకు హడ్కో ద్వారా లోన్ ఇప్పించేందుకు ప్రభుత్వ హామీ ఇచ్చేందుకు ఆమోదం

కుప్పం, దగదర్తిలో విమానాశ్రయాల ఏర్పాటు కోసం వెయ్యి కోట్లు రుణం తీసుకునేందుకు హామీ ఇవ్వాలని నిర్ణయం

విశాఖలో జరగనున్న పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్‌కు సింగపూర్ ప్రభుత్వంతో ఒప్పందం

అమరావతిలో ఉండవల్లి వద్ద మరో పంపింగ్ స్టేషన్ నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం

పంపింగ్ స్టేషన్ నిర్మాణం కోసం ప్రపంచ బ్యాంక్, ఎడీబీ బ్యాంక్ ద్వారా రూ. 595 కోట్లు రుణం తీసుకునేందుకు పరిపాలనాపరమైన ఆమోదం

కృష్ణయ్యపాలెం, వెంకటపాలెం, పెనుమాకలో రోడ్లు, డ్రైనేజీలు, సదుపాయాల కల్పన కోసం రూ.1863 కోట్లతో కాంట్రాక్ట్ ఇచ్చేందుకు ఆమోదం

జీవిత ఖైదు పడిన ముగ్గురు ఖైదీలకు క్షమాబిక్ష ప్రసాదించే ప్రతిపాదనకు క్యాబినెట్ ఆమోదం

సంతమాగలూరులో 1000 ఎకరాల స్థలంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం

కర్నూలు జిల్లా హొళగుంద, ఆలూరులో 2 మెగావాట్‌ల సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం

ఎపీపీఎఫ్‌సీఎల్ కు పలు సంస్థల ద్వారా 5 వేల కోట్ల రుణాలు పొందేందుకు క్యాబినెట్ ఆమోదం

ధర్మవరంలో మెగా హ్యాండ్లూమ్ పార్క్ ఏర్పాటుకు భూమిని హ్యాండ్లూమ్ శాఖకు అద్దెకి ఇచ్చే ప్రతిపాదనకు ఆమోదం

అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులు, కౌలు రైతులకు ఆర్థిక సాయం కింద రాష్ట్రం రూ.14 వేలు, కేంద్రం రూ. 6 వేలు ఇచ్చే ప్రతిపాదనకు ఆమోదం

తిరుపతి రూరల్ వావిలాల గ్రామంలో 2 ఎకరాలను టీడీపీ పార్టీ కార్యాలయం నిర్మాణానికి లీజు ఇచ్చేందుకు ఆమోదం

ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద 2.0 లో 100 ఎకరాల భూమిని ఎపీ టిడ్కోకి ఇచ్చే ప్రతిపాదనకు ఆమోదం

మచిలీపట్నం సమీపం మాచవరంలో 1.60 ఎకరాల భూమిని తెలుగుదేశం పార్టీ కృష్ణ జిల్లా శాఖకు కేటాయింపునకు ఆమోదం

నియోజకవర్గాల్లో పార్టీ కార్యాలయాలకు ఇచ్చిన భూమిని లీజు 33 నుంచి 66 లేదా 99 ఏళ్లకు పెంచే సవరణకు మంత్రివర్గం ఆమోదం రెవెన్యూ వ్యవస్థలో ఫిర్యాదులు లేకుండా పని చేయాలని సీఎం ఆదేశాలు మొంథా తుఫానులో ప్రజా ప్రతినిధులు కష్టపడి పనిచేశారని సీఎం కితాబు

## పుట్టపర్తికి ప్రధాని మోదీ 19న రాక

-మొదటిపేజీ తరువాయి

తీసుకోవాలని సీఎం ఆదేశించారు. వచ్చే వాహనాలకు పార్కింగ్‌తో పాటు పట్టణంలో రాకపోకల ఇబ్బంది లేకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారు. బాబా మహాసమాధి దర్శనానికి ఎంత మంది భక్తులు రావచ్చనేదానిపై అంచనా వేసి అందుకు తగ్గట్లుగానే ఏర్పాట్లు చేయాలన్నారు. భక్తుల కోసం అవసరమైన మేరకు ఆర్టీసీ బస్సులను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ముందుస్తు జాగ్రత్తగా మెడికల్ క్యాంపులు సైతం ఏర్పాటు చేసుకోవాలని సీఎం సూచించారు. పుట్టపర్తిలోని వేర్వేరు ప్రాంతాల్లో 10 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు సీఎంకు తెలియజేశారు. పారిశుద్ధ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

**10 రోజులు 682 రైళ్లు**

పుట్టపర్తికి వచ్చే భక్తులకు చిన్నపాటి ఇబ్బందులూ తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు అధికారులు సీఎంకు వివరించారు. పారిశుద్ధ్యం నిర్వహణకు 250 మంది సిబ్బంది, వచ్చే భక్తులకు తాగునీరు, ఆహారం, మరుగుదొడ్లు వంటి సదుపాయాలను కల్పిస్తున్నట్లు అధికారులు సీఎంకు తెలిపారు. జయంతి వేడుకల నేపథ్యంలో 65 ప్రత్యేక రైళ్లతో పాటు ఈనెల 13వ తేదీ నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు 682 రైళ్లు పుట్టపర్తికి రైల్వే శాఖ నడుతోందని వివరించారు. పుట్టపర్తి బస్ స్టేషన్ నుంచి రైల్వే స్టేషన్‌కు రోజుకు 20 బస్సులు భక్తుల రవాణా కోసం ఏర్పాట్లు చేసినట్లు అధికారులు వివరించారు. సమీక్షలో మంత్రులు సవిత, సత్యకుమార్ యాదవ్, ఆనం రామనారాయణరెడ్డి, అనగాని సత్యప్రసాద్, సీఎస్ విజయానంద్, అధికారులు పాల్గొన్నారు.

## అమరావతి-విశాఖ ఎకనామిక్ రీజియన్...

-మొదటిపేజీ తరువాయి

ఎలా అభివృద్ధి చేయాలనే దానిపై ప్రధానంగా చర్చించారు. ఈ ప్రాంతంలోని సహజ వనరులు, మౌలిక సదుపాయాలను వినియోగించుకుంటూ పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా ఆర్థిక ప్రగతికి బాటలు వేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ లక్ష్య సాధన కోసం ఒక పటిష్టమైన 'ఎకనామిక్ మాస్టర్ ప్లాన్' రూపొందించాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఈ ప్రణాళికలో ఆయా జిల్లాల ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడం, పెట్టుబడులకు అనువైన వాతావరణం కల్పించడం, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరచడం, పర్యావరణ పరిరక్షణతో కూడిన సుస్థిరాభివృద్ధి సాధించడం వంటి కీలక అంశాలు ఉండాలని ఆయన సూచించారు. ఈ కీలక సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్‌తో పాటు ఆర్థిక, పర్యాటక, పారిశ్రామిక, రవాణా, ఐటీ, మున్సిపల్, వ్యవసాయ, ప్రణాళికా విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. వారు తమ విభాగాల పరంగా చేపట్టాల్సిన చర్యలపై ముఖ్యమంత్రికి వివరాలు అందించారు.

## జగన్ అందుకే అసెంబ్లీకి రావడం లేదు

-మొదటిపేజీ తరువాయి

గత ప్రభుత్వంలో ప్రభువులయ్యారు. గత పాలకుడికి అధికారం తెలుసు తప్ప.. పరిపాలన తెలియదు. మూర?త్వంతో ప్రజలను ఇబ్బందులు పెట్టారు. రాష్ట్ర ఖజానాను దోచుకున్నారు. ప్రజలు కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి రాష్ట్రాన్ని కాపాడారు. అనేక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్రంలో చిత్తశుద్ధిగా పని చేస్తుంటే వైకాపా నేతలు వక్రీకరిస్తున్నారు. జగన్ కేవలం ఓ ఎమ్మెల్యే మాత్రమే. సాధారణ ఎమ్మెల్యేకు ఇచ్చిన సమయమే జగన్‌కు ఇస్తాం. వచ్చి అసెంబ్లీలో మాట్లాడాలి. నా ఎదుట అసెంబ్లీలో 'అధ్యక్షా' అని సంబోధిస్తూ మాట్లాడటం ఇష్టం లేకే జగన్ అసెంబ్లీకి రావడం లేదు. బయట మీడియా ముందు మాట్లాడటం కాదు.. అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలి. జగన్ తప్ప.. మిగతా 10 మంది ఎమ్మెల్యేలు జీతాలు తీసుకుంటున్నారు. కానీ, అసెంబ్లీకి రావడం లేదు" అని అయ్యన్నపాత్రుడు అన్నారు.

## గోడౌన్లు సిద్ధం చేయాలి



-మొదటిపేజీ తరువాయి

(ఎఫ్‌సీఐ)కు 14 లక్షల మెట్రిక్ టన్నుల చొప్పున సీఎంఆర్ బియ్యాన్ని నిల్వ చేసేందుకు గోడౌన్లను సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. అనంతరం ధాన్యం మిల్లింగ్, నిల్వ ప్రక్రియలో పారదర్శకతకు పెద్దపీట వేయాలని మంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. డ్రైయర్ల సౌకర్యం ఉన్న రైస్ మిల్లులకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. అక్రమాలకు తావులేకుండా ప్రతి గోడౌన్ వద్ద నిరంతర నిఘా కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత కెమెరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా, జిల్లాల వారీగా రైస్ మిల్లర్లు 1:2 నిష్పత్తిలో బ్యాంక్ గ్యారంటీలు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకు సుమారు 35 బ్యాంకులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, కార్యదర్శి సూరిబాబు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు. సివిల్ సప్లైస్ మేనేజింగ్ డైరెక్టర్ ఢిల్లీ రావు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.

## రాళ్లవాగులో వజ్రాల వేట

**కర్నూలు :** వర్షాకాలం ప్రారంభం అయితే చాలు ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ జిల్లాల్లో వజ్రాల వేట మొదలవుతుంది. తమ అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఎక్కడెక్కడి నుంచో జనాలు తరలి వస్తుంటారు. రోజుల తరబడి పొలాల్లో కూర్చుని వజ్రాల కోసం గాలిస్తుంటారు. ప్రతి సంవత్సరం కొందరికైనా వజ్రాలు దక్కుతాయి. దక్కని వారు.. వచ్చే సంవత్సరం చూసుకుందాం అని వెళ్లిపోతారు. ఇప్పుడు ఈ జాబితాలోకి మరో ప్రాంతం చేరింది. అక్కడ వజ్రాలు దొరుకుతున్నాయంటూ సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం సాగుతుండటంతో.. జనాలు తండోపతండాలుగా అక్కడకు తరలి వస్తున్నారు. మరి నిజంగానే అక్కడ వజ్రాలు దొరుకుతున్నాయా అంటే..ఆంధ్రప్రదేశ్‌లోని నల్లమల అడవిలో పారే రాళ్లవాగు ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. ఇక్కడ వజ్రాలు దొరుకుతున్నాయంటూ ప్రచారం సాగుతుండటంతో.. రాళ్ల వాగు కాస్త వజ్రాల వాగుగా మారింది. మరి నిజంగానే ఇక్కడ వజ్రాలు దొరుకుతున్నాయా అంటే.. ఇప్పటి వరకు డైమండ్స్ దొరికిన వాళ్లు ఒక్కరు కూడా లేదు. కానీ సోషల్ మీడియాలో ప్రచారం చూసి స్థానిక ప్రాంత ప్రజలు, పేదలు, కూలీలు తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడం కోసం రాళ్ల వాగు వద్దకు తరలి వస్తున్నారు. ఈ వాగులో వజ్రాల కోసం వేట కొనసాగుతుండటంతో రాళ్లవాగు ఇప్పుడు ఉమ్మడి కర్నూలు జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది.ఈ రాళ్ల వాగు.. మహానంది మండలంలోని గాజులపల్లె గ్రామ సమీపంలో.. నల్లమల అడవిలో ఉన్న పురాతన శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం కింది భాగంలో ప్రవహిస్తూ ఉంటుంది. అయితే ఈస్వామి వారి కళ్యాణం సందర్భంగా వజ్రాలతో తలంబ్రాలు పోశారని స్థానికులు నమ్ముతారు. ఈ వజ్రాలు కాస్త.. ఆలయం క్రింద భాగంలో ప్రవహించే రాళ్లవాగులో కలిశాని.. అందుకే ఇక్కడ వజ్రాలు దొరికేందుకు అవకాశం ఉంది అంటున్నారు. అలానే ఈ రాళ్ల వాగును వజ్రాల వాగుగా పిలుస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఈ వాగులో వజ్రాలు లభ్యమవుతున్నాయనే ప్రచారం ఉండేది. దీంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వజ్రాల మీద ఆశతో.. వాగు వెతుకుతున్నారు. అయితే ఎవరికి ఏ వజ్రం దొరకలేదని చెబుతున్నారు. కేవలం సుద్దరాళ్లు మాత్రమే లభిస్తున్నాయని తెలుస్తోంది.ఈ ప్రాంతం.. గాజులపల్లె రైల్వే స్టేషన్‌కు సమీపంలోనే ఉండటం, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఉండటంతో మహిళలు కూడా ఎక్కువ సంఖ్యలో వస్తున్నారు. ఎవరికైనా వజ్రం దొరికిందని అనుమానం కలిగితే.. దానిని పరీక్షించేందుకు అక్కడే కొందరు వ్యక్తులు పరికరాలతో పరీక్షిస్తున్నారు. అయితే గతంలో ఒక్క రాయి పరీక్షించేందుకు 10 రూపాయలు తీసుకుంటే, ఇప్పుడు రూ.30 తీసుకుంటున్నారు. ఇక్కడ వజ్రాలు అయితే దొరకడం లేదు కానీ.. హోటళ్లు, కూల్ డ్రింక్ షాపులు, ఐస్ క్రీములు అమ్మే బండ్లకు మాత్రం మంచి వ్యాపారం జరుగుతోంది.

# 48 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు

**విజయవాడ :** టీడీపీ ఎమ్మెల్యేల్లో 48 మంది పూర్తిగా దారి తప్పారని చంద్రబాబునాయుడు గుర్తించారు. ఎన్నిసార్లు చెప్పిన వికపోవడంతో నోటీసులు జారీ చేయాలని నిర్ణయించు కున్నారు. ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనకపోవడం, ప్రవర్తనలో లోపాలు ఉన్న 48 మంది ఎమ్మెల్యేలకు వెంటనే నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. తీరు మారకపోతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ శ్రేణులతో సమావేశమైన సీఎం, పెన్షన్ల పంపిణీ, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల అందజేత వంటి కార్యక్రమాలపై సమీక్షించారు. ప్రజల సమస్యలను పరిష్కారానికి ఎమ్మెల్యేలు ఎంత మంది అందుబాటులో ఉంటున్నారో తెలుసుకున్నారు. సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు కాల పరిమితి తీరిపోయే వరకూ పంపిణీ చేయకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. పెన్షన్ల పంపిణీ, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేసే కార్యక్రమాల్లో 48 మంది ఎమ్మెల్యేలు పాల్గొనకపోవడం సీఎం దృష్టికి వచ్చింది. బ్యాక్ ఆఫీసు, ప్రోగ్రాం కమిటీకి ఆదేశాలు జారీ చేస్తూ, ఆ ఎమ్మెల్యేలకు నోటీసులు ఇచ్చి వివరణ కోరాలని సూచించారు. వివరణ సంతృప్తికరంగా లేకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పేదల సేవలో భాగంగా పెన్షన్ల పంపిణీలో మంత్రులు, ఎమ్మెల్యేలు తప్పకుండా పాల్గొనాలని సీఎం ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాల్గొని, కార్యకర్తలు, ప్రజలతో మాట్లాడాలని సూచించారు. టీడీపీ కార్యకర్తలకు ఇన్సురెన్స్, సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీలో కూడా ఎమ్మెల్యేలు తప్పకుండా పాల్గొనాలి. పనిచేసిన వారందర్నీ కలుపుకుని వెళ్లాలన్నారు. ప్రతి శుక్రవారం నియోజకవర్గ టీడీపీ కార్యాలయాల్లో జరిగే ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పాల్గొనాలి. పాల్గొనకపోతే పార్టీ కేంద్ర కార్యాలయం వివరణ తీసుకోవాలి ఆదేశించారు. కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు గతంలో కంటే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పేదలకు ఎన్నోకష్టాల్లో ఉంటే సీఎంఆర్‌ఎఫ్ కు దరఖాస్తు చేసుకుంటారు. వారికి మంజూరు అయిన డబ్బులు కూడా ఇవ్వడానికి ఎమ్మెల్యేలకు తీరిక లేకపోతే ఇక వారికి ప్రజా సేవ చేయడానికి అర్హత ఏముంటుందన్న ప్రశ్నలు వస్తున్నాయి. సీఎం ఆర్‌ఎఫ్ చెక్కులకు మూడు నెలల పరిమితి ఉంటుంది. ఇష్యూ చేసిన తేదీ నుంచి మూడు నెలల పాటు చెక్కులు పంపిణీ చేయకపోవడం వల్ల అవి తిరిగి వస్తున్నాయి . కొత్తగా చెక్కులు




జారీ చేయాల్సిన పరిస్థితి వస్తోంది. ఇది సీఎంను అసహనానికి గురి చేసింది. ఇప్పటి వరకూ చూశామని ఇక పనితీరు మార్చుకోకపోతే పక్కన పెట్టాలని నిర్ణయించుకున్నట్లుగా తెలుస్తోంది.

కొలిక్కొ తిరువూరు వివాదం...

తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస రావు, ఎంపీ కేశినేని చిన్ని మధ్య వివాదం చెలరేగిన సంగతి తెలిసిందే. ఇద్దరు నేతలు ఒకరిపై ఒకరు తీవ్ర ఆరోపణలు చేసుకున్నారు. ఓపెన్ గానే విమర్శలు గుప్పించుకున్నారు. ఇరువురు నేతలు మీడియాకు ఎక్కి రచ్చ రచ్చ చేశారు. వీరి మధ్య వివాదం టీడీపీలో పెను దుమారమే రేపింది. దీంతో సీఎం చంద్రబాబు ఫుల్ సీరియస్ అయ్యారు. వీరి వ్యవహారంపై ఆరా తీశారు. అసలేం జరిగిందో తెలుసుకోవాలని , దీనిపై తనకు పూర్తి నివేదిక సమర్పించాలని టీడీపీ క్రమశిక్షణ కమిటీని ఆదేశించారు చంద్రబాబు.ఆయన ఆదేశాలతో రంగంలోకి దిగింది టీడీపీ క్రమశిక్షణ కమిటీ. వర్ల రామయ్య, కొనకొళ్ల నారాయణ, పంచుమర్తి అనురాధ నేతృత్వంలోని ఈ కమిటీ.. నేతల మధ్య వివాదంపై ఆరా తీసింది. ఇరువురి నుంచి వివరణ తీసుకుంది. తిరువూరులో స్థానిక పరిస్థితులపైనా ఆరా తీశారు. ఈ అంశంపై నివేదిక రూపొందించి ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు. ఆ నివేదికలో ఏముంది? అనేది ఉత్కంఠగా మారింది. నివేదిక పరిశీలించిన తర్వాత సీఎం చంద్రబాబు నిర్ణయం ఏ విధంగా ఉండనుంది, ఎవరిపైన చర్యలు ఉంటాయి అనేది పార్టీ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.కాగా, తిరువూరు ఎమ్మెల్యే టికెట్ కోసం ఎంపీ కేశినేని చిన్ని 5 కోట్లు తీసుకున్నారని ఎమ్మెల్యే కొలికపూడి తీవ్ర ఆరోపణలు చేశారు. దీనికి ఘాటుగానే బదులిచ్చారు కేశినేని శివనాథ్. వైసీపీ కోవర్ట్ అంటూ కొలికపూడిపై ఎదురుదాడికి దిగారాయన.

# పర్యాటకం కోసం హోమ్ స్టే...

**తిరుపతి :** పర్యాటక రంగాన్ని ప్రోత్సహించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హోమ్‌స్టే విధానాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. దీని ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు.. పర్యాటకులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన వసతి కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగా ఔత్సాహికులు హోమ్ స్టేలు ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ మేరకు హోమ్ స్టే ఏర్పాటు చేయడానికి సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేసింది.రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని మరింత ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. అందులో భాగంగా అనేక చర్యలు తీసుకుంటోంది. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రముఖ పుణ్య క్షేత్రాలు, పర్యాటక ప్రాంతాల్లో.. సామాన్య పర్యాటకులకూ తక్కువ ఖర్చుతో నాణ్యమైన వసతి కల్పించేందుకు ప్రభుత్వం హోమ్‌స్టే విధానం తీసుకొచ్చిన విషయం తెలిసిందే. స్థానికులతో కలిసి సొంతింట్లో ఉన్న అనుభూతిని పర్యాటకులకు కల్పించడమే లక్ష్యంగా ఈ విధానాన్ని ప్రభుత్వం తీసుకొచ్చింది. దీని ద్వారా గిరిజన, గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈ విధానం అమలులో భాగంగా ఔత్సాహికులు హోమ్ స్టేలను ఏర్పాటు చేసుకునేలా దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. అందుకు సంబంధిచిన మార్గదర్శకాలు జారీ చేసింది.పర్యాటక శాఖ




మార్గదర్శకాల ప్రకారం.. హోమ్ స్టే ఏర్పాటు చేయాలనుకునే ఇంటి యజమానులు.. అక్కడే నివాసం ఉండాలి. వారు.. తమ ఇంట్లో కనీసం ఒకటి.. గరిష్ఠంగా ఆరు గదులను పర్యాటకులకు అద్దెకు ఇవ్వొచ్చు. ఇంట్లో కనీస వసతులు.. సురక్షిత మంచినీరు వంటివి అందుబాటులో ఉండాలి. శుభ్రమైన పరిసరాలు, టాయిలెట్లు ఉండాలి. ఏసీ, టీవీ, ఇంటర్నెట్, ఫర్నిచర్ వంటి వసతులతో పాటు పార్కింగ్ ప్రదేశం కూడా ఉండాలి. హోమ్ స్టేలకు వచ్చిన పర్యాటకుల వివరాలు (గుర్తింపు కార్డులు, పాస్‌పోర్ట్) నమోదు చేసుకోవాలి. అవసమైనప్పుడు అధికారులు తనిఖీలు చేసేందుకు వీలుగా అందుబాటులో ఉండేలా చూసుకోవాలి.పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా కల్పించారు. ఈ నేపథ్యంలో హోమ్‌స్టే విధానానికి త్వరితగతిన అనుమతులు లభించే అవకాశం ఉంది. ఆసక్తిగల ఇంటి ఓనర్లు దరఖాస్తు చేసుకునే సమయంలో.. గుర్తింపు, చిరునామా, ఆస్తి యాజమాన్య పత్రాలు, స్థానిక సంస్థల నుంచి నిరభ్యంతర పత్రం తదితర వివరాలు సమర్పించాలి. ఈ మేరకు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. స్థానిక పర్యాటక శాఖ అధికారులను కలిసి వివరాలు తెలుసుకోవచ్చు.దరఖాస్తు తర్వాత ఆంధ్రప్రదేశ్ టూరిజం అధికారులు ఇంటిని తనిఖీ చేస్తారు. అనంతరం అప్రూవల్ సర్టిఫికెట్ ఇస్తారు. ఆ తర్వాత లైసెన్స్ మంజూరు చేస్తారు. లైసెన్స్ వచ్చిన తర్వాత.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల ప్రకారం వసతులు కల్పించాలి. కాగా, అరకు, విశాఖపట్నం, కోనసీమ, విజయవాడ, తిరుపతి ప్రాంతాల్లో.. గిరిజన, వారసత్వ, గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో హోం స్టేలను అభివృద్ధి చేయడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ముఖ్యంగా పల్నాడు జిల్లాలో ఇప్పటికే దాదాపు 30 పర్యాటక కేంద్రాలను అధికారులు గుర్తించారు. అందులో అమరావతి ఆలయం, బౌద్ధ స్తూపం, కొండవీడు, కోటప్పకొండ, నాగార్జునకొండ, సత్రశాల, దైద, ఎత్తిపోతల తదితర ప్రాంతాలు ఇన్నాయి.=

# పట్టణంలో 16, 17వ వార్డుల్లో డ్రైనేజీ సమస్యని పట్టించుకోని అధికారులు

## భరించలేని స్థాయిలోదర్గంధం-ప్రజల ఆరోగ్యానికిముప్పు

**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 10:** రామచంద్రపురం పట్టణంలోని 16వ మరియు 17వ వార్డులలో గత కొన్ని రోజులుగా డ్రైనేజీ నీరు రోడ్డు మీదకు పొంగిపడుతూ ప్రజలకు నరకయాతనలా మారింది. చిన్న పిల్లల నుంచి వృద్ధుల వరకు రోజూ మురుగు నీటిలో నడుస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.స్థానికుల వివరాల ప్రకారం, మున్సిపాలిటీ అధికారులు ఐదు రోజుల క్రితం డ్రైనేజీ లైన్ వేస్తామని పని మొదలు పెట్టి మధ్యలోనే ఆపివేయడంతో నీటి ప్రవాహం పూర్తిగా బ్లాక్ అయి, డ్రైనేజీ నీరు రోడ్డు మీదకు పొంగిపడి దాదాపు 20 అడుగుల మేర రహదారి మొత్తం మురికి నీటితో నిండిపోయింది.ఈ ప్రాంతం జనసాంద్రత ఎక్కువగా ఉండడమే కాకుండా, అమ్మవారి ఆలయానికి ఎదురుగా ఉండటం, పాదచారులు మరియు భక్తులకు మరింత ఇబ్బందికర పరిస్థితిని సృష్టిస్తోంది.ఇంకా భయంకరమైన విషయం ఏమిటంటే ఈ ప్రాంతం ముచ్చుమిల్లి రోడ్డు నుండి వెంటూరు వైపు వెళ్ళే మెయిన్ రోడ్ ఇక్కడ రోజూ వందలాది వాహనాలు వెళ్ళే రహదారి. డ్రైనేజీ నీరు నిల్వ కావడంతో ఏ క్షణంలోనైనా బైక్‌లు, ఆటోలు





జారిపడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇప్పటికే ఆ ప్రాంతంలో వాహనాలు జారిపడే ఘటనలు సంభవించినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నా మున్సిపాలిటీ అధికారులు మాత్రం మౌనం వీడడం లేదు" అని స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రజలు డిమాండ్ చేస్తూ డ్రైనేజీ పనులు మధ్యలో వదిలి ప్రజలను మురికి నీటిలో కూర్చోబెట్టడం మున్సిపాలిటీ నిర్లక్ష్యం. వెంటనే సిబ్బందిని పంపించి రోడ్డు శుభ్రం చేసి, డ్రైనేజీ లైన్ పూర్తి చేయాలి. లేకపోతే ఆందోళన తప్పదని" హెచ్చరిస్తున్నారు.ఈ ప్రాంతం రామచంద్రపురం పట్టణం మధ్యలో ఉండటం వల్ల సమస్యను చిన్నదిగా చూడకూడదు. తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రజలు మున్సిపాలిటీకి విజ్ఞప్తి చేస్తున్నారు

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్

- అన్నదాతలకు అండగా కూటమి ప్రభుత్వం
- రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు

**కోనసీమ జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 10:** దేశానికి అన్నం పెట్టే అన్నదాతలను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ఎప్పుడు ముందు ఉంటుందని కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం పేర్కొన్నారు. సోమవారం ద్రాక్షారామంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిశ్వంతరాయ్, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు. దీనికిగాను రామచంద్రపురం నియోజవర్గంలో 62 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వీటిలో రామచంద్రపురం మండలంలో 21, కె గంగవరం మండలంలో 19, కాజులూరు మండలంలో 22 ఉన్నాయన్నారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తూనే పంటకు తగ్గ గిట్టుబాటు ధర కల్పిస్తున్నామని వెల్లడించారు.





ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంతరాయ్ మాట్లాడుతూ 2025-26 ఖరీఫ్ కు సంబంధించి నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు సేకరణ లక్ష్యంగా రైతు సేవా కేంద్రాలు కృషి చేస్తా యన్నారు. ఏ గ్రేడ్ రకానికి క్వింటాల్కు రూ. 2,389/- సాధారణ రకానికి రూ. 2,369/- గా ప్రభుత్వం ధర నిర్ణయించిందన్నారు. రైతులకు ఇతరత్రా ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా కంట్రోల్ రూమ్ నెంబర్ 83094 32487,94416 92275 నెంబర్ల కు, టోల్ ఫ్రీ నెంబర్ 1967 నెంబర్లకు ఫిర్యాదు చేయవచ్చును అన్నారు. జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ మాట్లాడుతూ దళారులను, మధ్యవర్తులను నమ్మకుండా నేరుగా రైతు సేవ కేంద్రాల్లో అమ్మకాలు చేసుకోవాలని రైతులకు సూచించారు. అన్నదాతలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని, మరిన్ని వివరాల కోసం రైతు సేవ కేంద్రంలో సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ
ఏడిఏ బి నాగ కుమార్ , ఏఈ మణిదీప్, ఏఎంసీ వైస్ చైర్మన్ దడాల నాగార్జున, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పెంకే అన్నపూర్ణ, ద్రాక్షారామం పిఏసిఎస్ అధ్యక్షులు ముప్పనపల్లి గణేష్, ద్రాక్షారామం సర్పంచ్ కొత్తపల్లి అరుణ, టిడిపి రూరల్ మండల అధ్యక్షుడు కొత్తపల్లి శీను బాబు, ఏఎంసీ డైరెక్టర్లు, కూటమి పార్టీ నాయకులు పెంకే సాంబశివరావు, సంపత్ సత్యనారాయణ, వాసంశెట్టి శ్రీను తదితరులు పాల్గొన్నారు. తొలుత రైతుల సౌకర్యార్థం ముద్రించిన కరపత్రాలను వాసంశెట్టి సత్యం, అధికారుల చేతుల మీదుగా విడుదల చేశారు.

## కుష్టు వ్యాధిపై అపోహలు తొలగించాలి:

- సంయుక్త కలెక్టర్ మౌర్య భరద్వాజ్
- ఈ నెల 17 నుంచి 30వరకు కుష్టు వ్యాధిపై ఇంటింటి సర్వే నిర్వహించాలి




**అంకుశం ప్రతినిధి పుట్టపర్తి నవంబరు 10:** శ్రీ సత్య సాయి జిల్లాలో కుష్టు వ్యాధిపై ప్రజల్లో ఉన్న అపోహలు తొలగించడంతోపాటు.. వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స అందించాలని సంయుక్త కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమంపై సోమవారం కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ హాలులో జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంయుక్త కలెక్టర్ మాట్లాడుతూ... ఈ నెల 17 నుంచి 30వ తేదీ వరకూ వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టాలన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరినీ గుర్తించి వైద్య సౌకర్యాలు అందించాలన్నారు. కుష్టు వ్యాధి లక్షణాలను ప్రాథమిక దశలోనే గుర్తించి వైద్య సేవలు అందిస్తే ఆరు నెలల్లో పూర్తిగా నయం అవుతుందన్నారు. జిల్లాలోని ప్రతి వ్యక్తికీ కుష్టు వ్యాధి పరీక్షలు చేయాలని ఆదేశించారు. పాఠశాలలు, సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల్లో ఉన్న విద్యార్థులందరికీ వైద్య పరీక్షలు చేయించాలన్నారు. అనంతరం అధికారులతో కలిసి కుష్టు వ్యాధి నిర్మూలన ప్రచార పోస్టర్ను జేసి ఆవిష్కరించారు.

ఈ సమావేశంలో డీఆర్వో సూర్యనారాయణ రెడ్డి, ఆర్డీఓ సువర్ణ, డిఎంహెచ్ డాక్టర్ డా. ఫిరోజా బేగం, జిల్లా కుష్టు నివారణ అధికారిణి డా. అనుపమ జేమ్స్, డిపిఎంఓ రెడ్డి కుమార్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## 21 వ వార్డులో వై సి పి కోటి సంతకాల సేకరణ కార్యక్రమం

**అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 10:** ధర్మవరం మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట రామిరెడ్డి పిలుపు మేరకు రాష్ట్ర అధినేత వై ఎస్ జగన్ ఆదేశాలు మేరకు ధర్మవరం లో కోటి సంతకాల సేకరణ ఉద్యమం అన్ని వార్డులలో చురుకుగా జరుగుతున్నట్లు 21 వార్డు వైసి పి ఇంచార్జి కత్తె పెద్దన్న సోమవారం తెలియజేసారు.



## పేదలకు వైద్య విద్య అందుబాటులో ఉంచాలి- మాజీ ఎమ్మెల్యే సత్తి





- తొస్సిపూడిలో రచ్చబండ నిర్వహణ

**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 10:** నిరుపేదలకు వైద్య విద్యను అందుబాటులో వుంచే విధంగా చూడాలని అనపర్తి మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం, తొస్సిపూడి గ్రామంలో మెడికల్ కళాశాల ప్రైవేటీకరణను నిరసిస్తూ కోటి సంతకాల సేకరణ - రచ్చబండ కార్యక్రమం ఆదివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తే నిరుపేదలకు వైద్య విద్య, వైద్యం రెండూ అందని ద్రాక్షగా ఉండిపోతాయన్నారు. ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా వచ్చి సంతకాల సేకరణలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో పోతుల వర ప్రసాద్ రెడ్డి (బుజ్జి) (బిక్కవోలు మండల వైయస్ఆర్‌సీపీ కన్వీనర్), ద్వారంపూడి వీర వెంకట రామారెడ్డి (తంబి) (గ్రామ ఉప సర్పంచ్), నల్లమిల్లి త్రినాథ్ రెడ్డి (బాబి) (గ్రామ అధ్యక్షులు), కర్రి సుబ్బారెడ్డి, ద్వారంపూడి వెంకట సత్యనారాయణ రెడ్డి (అబ్బులు), తేతలి శేఖర రెడ్డి, కర్రి వరలక్ష్మి, గుబ్బల అన్నవరం (మాజీ సర్పంచ్), విస్సాకోటి సుబ్బారావు (మాజీ సర్పంచ్), పలివెల జార్జి, మల్లిడి జగ్గిరెడ్డి (మాజీ వీఆర్ఓ), తేతలి రామారెడ్డి (కొట్టు రాము), CH చాణిక్య, మేడపాటి వెంకట కృష్ణా రెడ్డి, మేడపాటి ఆంజనేయ రెడ్డి, దాకమూర్తి అప్పన్న, పల్లి రాముడు, పల్లి రమణ తదితర వైయస్ఆర్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ధర్మవరం లో చేనేత క్లస్టర్ మంజూరు...

## బీజేపీ చేనేత ల హర్షం!

**అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 10:** రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రివర్యులు శ్రీ సత్యకుమార్ యాదవ్ చొరవతో ఎన్నో ఏళ్ల చేనేతల కలని సాకారం చేస్తూ రాష్ట్ర క్యాబినెట్ లొ ఈ రోజు క్లస్టర్ సంబంధించిన ఆమోదం పొందటం జరిగినది, అందుకుగాను హర్షం వ్యక్తం చేస్తూ కూటమి నాయకులు,కగ్గోలు హరీష్ బాబు, రాష్ట్ర చేనేత నాయకులు గిర్రాజు నాగేష్,పట్టణ బీజేపీ అధ్యక్షులు జింకా చంద్ర శేఖర్, గౌట్లూరు చంద్ర,జిల్లా బీజేపీ ఉపాధ్యక్షులు జింకా రామాంజనేయులు తదితరులు కార్యకర్తలు, మరియు చేనేతలు పెద్దసంఖ్యలో ధర్మవరం కదిరిగేట్ వద్ద చేనేత విగ్రహం వద్ద రాష్ట్ర మంత్రివర్యులు శ్రీ సత్యకుమార్ యాదవ్ చొరవతో ఎన్నో ఏళ్ల చేనేతల కలని సాకారం చేస్తూ రాష్ట్ర క్యాబినెట్ లొసోమవారం



చేనేత క్లస్టర్ సంబంధించిన ఆమోదం పొందటం జరిగినది, అందుకుగాను హర్షం వ్యక్తం చేస్తూ కూటమి నాయకులు, కార్యకర్తలు, మరియు చేనేతలు పెద్దసంఖ్యలో ధర్మవరం కదిరిగేట్ వద్ద చేనేత విగ్రహం వద్ద అందరూ కలసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

## సాయిరెడ్డి ఆధ్వర్యంలో పేదలకు వైద్యసేవలు

లోటస్ హాస్పిటల్ సౌజన్యంతోఉచితంగా కిడ్నీ పరీక్ష ,లివర్ పరీక్షలు





**తూర్పుగోదావరి జిల్లా అంకుశం న్యూస్ రిపోర్టర్ నవంబర్ 10:** తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త సాయిరెడ్డి ఆధ్వర్యంలో లోటస్ హాస్పిటల్ రాజమండ్రి వారి సౌజన్యంతో నిడిగట్ల గ్రామపరిధిలో పేదలు కొరకు మెగా ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఇందులో భాగంగా 120 మందికి పైగా ఉచితంగా కిడ్నీ పరీక్ష ,లివర్ పరీక్ష , మధుమేహం పరీక్ష,రక్తపోటు చేసి అవసరమైన చికిత్స తో పాటు అలాగే డాక్టర్ కె ప్రదీప్, డాక్టర్ కె శ్రావణి ఆధ్వర్యంలో అందరికీ ఉచితవైద్యపరిక్షలు నిర్వహించి అందరికీ ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, సాయిరెడ్డి, K. జెర్రీ బాబు, V. సురేష్, K..ప్రేమ్ , B. శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## కృష్ణా జిల్లాలో నున్న పిఏసిఎస్ ఒక మోడల్ సొసైటీగా నిలుస్తోంది

సభ్యులకు రూ.39.46 లక్షల డివిడెండ్‌ను కూడా పంపిణీ







**అంకుశం న్యూస్ విజయవాడ నవంబర్ 10:** నున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పిఎసిఎస్) కృష్ణా జిల్లాలో ఒక మోడల్ సొసైటీగా నిలుస్తుందని, రూ.79 కోట్ల వార్షిక వ్యాపార టర్నోవర్‌ను సాధించి రూ.2.14 కోట్ల లాభాన్ని ఆర్జించిందని కృష్ణా జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (కెడిసిసిబి) చైర్మన్ నెట్టెం రఘురామ్అ న్నారు. ఇది జిల్లాలోని మరే ఇతర సొసైటీకి లేని రికార్డు. రూ.40 కోట్లు డిపాజిట్ చేసి రూ.39 కోట్ల రుణాలు పొందినందుకు ఆయన సభ్యులను ప్రశంసించారు, ఇది బలమైన ఆర్థిక క్రమశిక్షణ మరియు సహకార సంస్థపై నమ్మకాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. సోమవారం సొసైటీ మల్టీపర్పస్ గోడౌన్‌లో నున్న పిఎసిఎస్‌లోని 1,359 మంది సభ్యులకు 2023-24 మరియు 2024-25 ఆర్థిక సంవత్సరాలకు డివిడెండ్‌గా రూ.39.46 లక్షలను కెడిసిసిబి చైర్మన్ నెట్టెం రఘురామ్ మరియు ప్రభుత్వ విప్ & గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకటరావు పంపిణీ చేశారు. అలాగే రూ. 1.10 కోట్ల అంచనా వ్యయంతో మొదటి అంతస్తులో కల్యాణ మండపం మరియు రెండవ అంతస్తులో డైనింగ్ హాల్‌కు కూడా వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రఘురామ్ మాట్లాడుతూ, లిఫ్ట్ సౌకర్యాలతో ఎయిర్ కండిషన్డ్ కల్యాణ మండపాన్ని నిర్మించడానికి ముగ్గురు సభ్యుల నున్నా పిఎసిఎస్ కమిటీ చొరవ తీసుకున్నందుకు రఘురామ్ ప్రశంసించారు, దీనిని ప్రగతిశీల దశగా అభివర్ణించారు. ప్రజా వినియోగం కోసం నామమాత్రపు అద్దెను నిర్ణయించాలని ఆయన సలహా ఇచ్చారు

భూముల బాలశేఖర్ రెడ్డి తన తండ్రి, మాజీ పిఎసిఎస్ డైరెక్టర్ భూముల వెంకట రెడ్డి జ్ఞాపకార్థం కల్యాణ మండపానికి రూ.2,00,016 విరాళాన్ని ప్రకటించారు.
నున్న పీఏసీఎస్ అధ్యక్షుడు కలకోటి శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. కెడిసిసిబి సిఇఒ ఎ శ్యామ్ మనోహర్, గన్నవరం ఎఎంసి చైర్మన్ జి నరసింహారావు, డైరెక్టర్లు పామర్తి శ్రీనివాసరావు, గంప శ్రీనివాసరావు, కెడిసిసిబి సత్యనారాయణపురం బ్రాంచ్ చీఫ్ మేనేజర్ పివి శ్రీనివాసరావు, పిఎసిఎస్ సిఇఒ తాడంకి రమేష్, సూపర్‌వైజర్ వి సాయికుమార్ పాల్గొన్నారు.

## సమస్యలపై నిర్లక్ష్యం వీడాలి.

- 377 అర్జీల స్వీకరణ
- జిల్లా కలెక్టర్ ఓ .ఆనంద్.



**అంకుశం న్యూస్ అనంతపురం, నవంబర్ 10:** నాణ్యతే ప్రామాణికంగా అర్జీల పరిష్కారం తో పాటు అర్జీదారుడు సంతృప్తిచెందేలా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ ఓ. ఆనంద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని రెవెన్యూ సమావేశ భవనంలో ప్రతి సోమవారం జరిగే (పి జి ఆర్ ఎస్) ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని జిల్లా లోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండిఅర్జీలను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణన్ శర్మ , అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్, డి ఆర్ ఓ మలోలా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు మల్లికార్జునుడు, రామ్మోహన్, మల్లికార్జున రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీదారులు వివిధసమస్యలపై సమర్పించిన అర్జీలనుఆయాశాఖలఅధికారులు క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీతగడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అలాగే ఆడిట్ తప్పనిసరిగా చేయాలనిమరియుపర్ఫామెన్స్ కి ఇండికేటర్లలో పెండింగ్ ఉన్న వాటిని వెంటనే పూర్తిచేయాలని ప్రాధాన్యత అంశాలపై సమీక్షలు నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు. అలాగే ఈనెల 17 నుండి 30 వరకు క్షేత్రస్థాయిలో ఇంటింటి కుష్టువ్యాధి నిర్ధారణ కార్యక్రమం నిర్వహిస్తున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారులకు సమన్వయ సహకారాలు అందించి కార్యక్రమాన్ని విజయంతం చేయాలన్నారు. ఈ రోజు కార్యక్రమంలో మొత్తం 377 అర్జీలు రాగా వాటిపై తగు చర్యలు తీసుకొని వాటినిపరిష్కరించాలని శాఖల అధికారులకు ఆదేశించారు.

## సత్య సాయి జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందజేసిన ధర్మవరం కాంగ్రెస్ నాయకులు తుంపర్తి పరమేష్...

**అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 10:** సోమవారం ధర్మవరం కాంగ్రెస్ పార్టీ నేతలు తుంపర్తి పరమేష్ బృందం పుట్టపర్తి కలెక్టరెట్ గ్రీవెన్స్ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది..ఈ సందర్భంగా వారు ధర్మవరం లో ఇందిరాగాంధీ గారి విగ్రహం ఏర్పాటుకు స్థలసేకరణ కావాలని కోరడమైనది.. భారతదేశ మొట్టమొదటి



మహిళా ప్రధాని భారతదేశ ఉక్కు మహిళ స్వర్గీయ శ్రీమతి ఇందిరా గాంధీ దేశ నిర్మాణం లో ఇందిరా గాంధీ గారి చెరిగిపోని ముద్ర వేశారని ముఖ్యంగా పేదరిక నిర్మూలన, అంటరానితనం నిర్మూలన, పేదలకు ఇల్లు మరియు భూమిపంపిణి వంటి ఎన్నో శాశ్వతమైన ప్రజా సంక్షేమ ముద్ర వేశారని కొనియాడారు.. వారి సేవలకు సార్థకంగా ధర్మవరం పట్టణం లో ఇందిరాగాంధీ గారి కాంస్యవిగ్రహం ఏర్పాటుకు అనువైన స్థలం కేటాయించాలని కలెక్టర్ గారిని కోరడమైనది.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కలిమ్,ఆనంద్,దాదాపిర్, రాజు, అమిర్ మధు తదితరులు పాల్గొన్నారు..

# లింగ నిర్ధారణ నిషేధిత చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి...

**– స్కానింగ్ కేంద్రాలపై గట్టి నిఘా చర్యలు తీసుకోవాలి...**

**– జిల్లా కలెక్టర్ ఓ .ఆనంద్**






**అంకుశం న్యూస్ అనంతపురం ,నవంబర్ 10:** గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టాన్ని పకడ్బందీగా క్షేత్రస్థాయిలోఅమలుచేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో పి.సి & ఎన్ డి టి యాక్ట్ ( గర్భస్థ పిండ లింగ నిర్ధారణ నిషేధిత చట్టం) అమలుపై జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రాప్రిఎట్ అథారిటీ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోప్రస్తుతం ఉన్న 185 స్కానింగ్ సెంటర్ పని తీరు పై గట్టి నిఘాచర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ముఖ్యంగా బాల్య వివాహాలపై అవగాహనతోపాటు లింగనిర్ధారణ నేరమనీ తెలియజేస్తూ విస్తృతంగా ప్రజల్లోఅవగాహన కార్యక్రమాలు కల్పించాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలోనిఆరోగ్యశాఖ సిబ్బంది ,పోలీసు,న్యాయశాఖ అధికారులు,మరియుస్వచ్ఛందసేవాసంస్థలు,సమన్వయంతో పని చేయాలని గర్భస్థలింగ నిర్ధారణ గురించి సమాచారం అందించాలన్నారు. స్కానింగ్ కేంద్రాలపై నిరంతర గట్టి నిఘా ఉంచి చట్టాన్ని అతిక్రమించి లింగ నిర్ధారణ చేసే ఆయా కేంద్రాలపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. స్కానింగ్ కేంద్రాలలో ప్రభుత్వ నిబంధనలో ఉల్లంఘించినట్లు తనిఖీలలో రుజువైతే ప్రభుత్వ నియమ నిబంధన మేరకు కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. జిల్లాలో ఏ ఆడపిల్ల కూడా పుట్టకముందే చనిపోకుండా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన పది సూత్రాలలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ, గంజాయి డ్రగ్స్ నివారణఎంతోముఖ్యమైనవని అలాగేచట్టరీత్యాలింగనిర్ధారణ చట్టరీత్యా నేరమని జిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. జిల్లా సరిహద్దుల్లో కర్ణాటక ప్రాంతానికి దగ్గరగా ఉన్న గ్రామాలలో కూడా గర్భస్థ లింగ నిర్ధారణ చట్టంపై ఎక్కువగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. డేకాయ్ ఆపరేషన్లను నిర్వహించాలని, ఇంటలిజెంట్ రింగ్ నివేదిక అందించాలని ఎట్టి పరిస్థితుల్లోనూ లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా ప్రణాళిక బద్ధంగాచర్యలు తీసుకోవాలన్నారు. చట్టాన్ని అతిక్రమిస్తే అలాంటివారిపై చర్యలుతప్పవని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. ఈ సమావేశాలలో డి ఎం హెచ్ ఓ డా. ఈ. బి.దేవి, స్త్రీ వైద్య నిపుణులు డా. శంషాద్ బేగం, ఆర్డిటి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి డా. దుర్గేష్, రెడ్స్ భానుజా, తదితరులు పాల్గొన్నారు.

# దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ కు అండగా వుంటాము

**– ఎంపీ కేశినేని శివనాథ్**

**– కార్పొరేషన్ ఛైర్మన్ గా కె. నాగుల్ మీరా ప్రమాణాస్వీకారం**

**– ముఖ్యఅతిథులుగా ఎంపీ కేశినేని, ఎమ్మెల్యే గద్దె , రాష్ట్ర మైనార్టీ సలహాదారులు ఎమ్.ఎ.షరీఫ్ హాజరు**







**అంకుశం ప్రతినిధి విజయవాడ నవంబర్ 10:** టిడిపిలో క్రమశిక్షణ గల నాయకుడు , నూర్ బాషాదూదేకుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ నాగుల్ మీరా ఆధ్వర్యంలో కార్పొరేషన్ ఆర్థికంగా అభివృద్ధి చెందాలి. ఈ సంఘానికి నిధులు కూడా వచ్చే విధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ సలహాదారులు ఎమ్.ఎ. షరీఫ్, నాగుల్ మీరా తో కలిసి సీఎం చంద్రబాబు తో మాట్లాడి కృషి చేస్తామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ తెలిపారు.

నూర్ బాషాదూదేకుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ గా నాగుల్ మీరా ప్రమాణ స్వీకారంతో పాటు ఆ కార్పొరేషన్ కి చెందిన 15 మంది డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవ కార్యక్రమం తాడేపల్లిలోని అన్నపూర్ణ కన్వెన్షన్ లో సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ సలహాదారులు ఎమ్.ఎ. షరీఫ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు.

ముందుగా ఎంపీ కేశినేని శివనాథ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ సలహాదారులు ఎమ్.ఎ. షరీఫ్ టిడిపి వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నూర్ బాషాదూదేకుల సంక్షేమ కార్పొరేషన్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ భీమశంకర రావు ఆధ్వర్యంలో కె.నాగుల్ మీరా నూర్ బాషాదూదేకుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు చేపట్టారు. అదే విధంగా ఆ కార్పొరేషన్ కి చెందిన 15 మంది డైరెక్టర్లు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా నాగుల్ మీరాకు ఎంపీ కేశినేని శివనాథ్ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ సలహాదారులు ఎమ్.ఎ. షరీఫ్ పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. అలాగే కార్పొరేషన్ డైరెక్టర్లకు కూడా ఎం.పీ కేశినేని శివనాథ్ అభినందనలు తెలుపుతూ సన్మానించారు.

ఈ సందర్భంగా ఎంపీ కేశినేని శివనాథ్ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో క్రమశిక్షణ గల నాయకుడికి నాగుల్ మీరా మారు పేరు అన్నారు. 1999లో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన నాగుల్ మీరా ఆ తర్వాత ఎలాంటి పదవులు ఆశించకుండా పార్టీ అధినేత నారా చంద్రబాబు ఆదేశాలను తూ.చ తప్పకుండా పాటిస్తున్న నాయకుడంటూ కొనియాడారు. నాగుల్ మీరాకు పదవి ఒక అలంకారం మాత్రమే అంటూ, నూర్ బాషాదూదేకుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ గా 20 లక్షల మందికి సేవ చేసే అవకాశం లభించటం అదృష్టమన్నారు. రాబోయే మూడున్నరేళ్లలో నూర్ బాషా అభివృద్ధి నాగుల్ మీరా కృషి చేయాలని కోరుకున్నారు.

ఆర్థికంగా ముస్లిం సమాజం వెనకబడిన సమాజం కాగా, ఇందులో ముఖ్యంగా వెనకబడిన నూర్ బాషా సంఘాన్ని ఆర్థికంగా సీఎం చంద్రబాబు సహకారంతో ముందుకు నడిపించాలని నాగుల్ మీరాను కోరారు.

యువగళం పాదయాత్రలో నారా లోకేష్ దృష్టికి వచ్చిన సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారని తెలిపారు. చట్టసభలో నూర్ బాషా సంఘానికి అవకాశం కల్పించే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు , డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్ కృషి చేస్తున్నారని తెలిపారు. ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత బడుగు బలహీన వర్గాల శ్రేయస్సు కోసం కృషి చేస్తోందన్నారు. రాష్ట్రంలో యువతకు బంగారు భవిష్యత్తు అందించాలనే సంకల్పంతో రాష్ట్రంలోనే ఉద్యోగావకాశాలు కల్పించేందుకు సీఎం చంద్రబాబు చేస్తున్న కృషి అందరం సహకారం అందంచాలని కోరారు. ఇక నూర్ బాషాదూదేకుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన కె.నాగుల్ మీరా మాట్లాడుతూ తనకి ఈ అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ముస్లిం ప్రాధాన్యత అన్ని రంగాల్లో వుందన్నారు. ఈ కార్పొరేషన్ డైరెక్టర్లగా జనసేన, బిజెపి లనుంచే కాకుండా టిడిపిలో క్రియశీలకంగా పనిచేసే వారికి అవకాశం ఇవ్వటం జరిగిందన్నారు. లతో పాటు ఎన్డీయే కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రైతుల ఆర్థిక ప్రయోజనాలే అజెండా

**– మొగలి పంటపై ఎపిఎంఎపిబి ప్రత్యేక అధ్యయనం :**

**– యూపీ, ఒరిస్సా రాష్ట్రాల్లో సీఈవో ఆవుల చంద్రశేఖర్ బృందం**





**అంకుశం ప్రతినిధిఅమరావతి, నవంబర్ 10 :**ఆంధ్రప్రదేశ్ ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్యాల బోర్డు (ఎపిఎంఎపిబి) రైతుల ఆర్థిక ప్రయోజనాలే అజెండాగా కసరత్తు ప్రారంభించింది. బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారి (సిఈఓ) ఆవుల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో జాతీయస్థాయిలో సమన్వయ సమావేశాలను సాగిస్తున్నారు. ఇందులో భాగంగానే రైతులకు అధిక ప్రయోజనం కల్పించేదిశగా మొగలి పంటపై ప్రత్యేక అధ్యయనం సాగుతోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కొన్ని జిల్లాలతో పాటు, ఉత్తరప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల్లో కూడా సిఈఓ చంద్రశేఖర్ అధికారుల బృందంతో పర్యటనలు సాగిస్తున్నారు. గతంలో ఉత్తరప్రదేశ్ లోని కనోజ్ ప్రాంతంలో కూడా ప్రత్యేకంగా అధ్యయనం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 926 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉంది. తీరానికి మూడు కిలోమీటర్ల వరకు ప్రథమశ్రేణి మొగలి పంట పండుతుందని అధికారులు గుర్తించారు. మొగలి అనేది సుగంధ ద్రవ్యాలు, ముఖ్యంగా మొగలి నూనె కోసం పెంచే ఒక వాణిజ్య పంట. ఇది సాధారణంగా ఉద్యాన పంటలకు అంతర పంటగా, కంచెగా లేదా కొబ్బరి తోటల మధ్యలో కూడా పండిస్తారు. వరి పంట గట్టు చుట్టూ, రోడ్డుకు ఇరువైపులా, ఇళ్ల వద్ద కంచె లాగా, పశువుల కొట్టం వద్ద కూడా మొగలి వేస్తారు.

**క్షేత్రస్థాయి పర్యటనలతో మెరుగైన ఫలితాలు : సిఈఓ ఆవుల చంద్రశేఖర్**

ఆంధ్రప్రదేశ్ రైతులకు మెరుగైన ఆర్థిక ప్రయోజనం కల్పించే దిశగా తమ అధ్యయనం సాగుతోందని ఏపీ ఔషధ మొక్కలు, సుగంధ ద్రవ్యాల బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారి (సిఈఓ) ఆవుల చంద్రశేఖర్ చెబుతున్నారు. క్షేత్రస్థాయి పర్యటనతో మిర్యాల ఫలితాలను సాధించవచ్చని వివరించారు. పరిశ్రమలను, పరిశోధనాశాలలను పరిశీలించామన్నారు. విజయవంతమైన నమూనాలతో, సూత్రాలతో ప్రయోగాత్మకంగా ముందుకు సాగుతామన్నారు. మొగలి పొదలు పెంచే రైతులకు అవసరమైన శిక్షణ, సలహాలు, సూచనలు అందజేస్తామన్నారు. కొన్ని ప్రాంతాల్లో పంట భూముల రక్షణకు ఏర్పాటు చేసుకున్న మొగలి చెట్లు రైతులకు పెట్టుబడి లేని ఆదాయనాలుగా మారాయన్నారు. ఏడాదిలో ఆరు నెలలకు పైగా మంచి ఆదాయాన్ని సమకూరుస్తున్నాయని, పండుగలు, ఇతర సీజన్లలో ఒక్కొక్క పువ్వు రూ. 40 దాకా అమ్ముడుపోతాయని చెప్పారు. . ఒరిస్సా పర్యటనలో కేంద్ర ప్రభుత్వ ఎంఎస్ఎంఈ సువాసన, రుచి అభివృద్ధి సంస్థ (బరంపురం) డిప్యూటీ డైరెక్టర్ రామారావు, బృందం, శాస్త్రవేత్త పురుషోత్తం, రాజారత్నం, నాయక్, ఎపిఎంఎపి ఉప కార్యనిర్వహణాధికారి ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గర్భవతులకు వైద్య పరీక్షలు

**రాప్తాడు, అంకుశం న్యూస్ నవంబర్ 10:** ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా డాక్టర్.శివకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం గర్భవతులకు వైద్య పరీక్షలు చేశారు. బీపీ, హెచ్.బి., షుగర్, హెచ్ఐవీ, రక్తపరీక్షలు, వీడీఆర్ఎల్, బరువు, ఫీటల్ హార్ట్ సౌండ్ తదితర పరీక్షలు చేశారు. డాక్టర్ శివకృష్ణ మాట్లాడుతూ ప్రతి గర్భవతి క్రమం తప్పకుండా ప్రతి నెల పరీక్షలు చేయించుకోవాలన్నారు. మంచి పౌష్టికాహారంతోపాటు అంగన్వాడీ ద్వారా ఇచ్చే అదనపు ఆహారం తీసుకోవలన్నారు. ప్రమాదకర గర్భవతులకు ప్రత్యేక పరీక్షలు చేశారు. 70 మంది గర్భవతులకు పరీక్షలు నిర్వహించారు. వారికి ఎం.ఎల్. హెచ్.పి మీనా పౌష్టికాహార భోజనం వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ శివప్రసాద్, సూపర్వైజర్ లు అరుణ, నరసింహ, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీధర్ బాబు, ఫార్మసిస్ట్ మూర్తి, ఎం.పి.హెచ్.ఏ నారాయణస్వామి, ఎం.ఎల్.హెచ్.పిలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



## 4వ చిత్ర కళా సంత పోస్టర్ ఆవిష్కరించిన ఎంపీ కేశినేని శివనాథ్



**అంకుశం ప్రతినిధి విజయవాడ : నవంబర్ 10 :**రాష్ట్ర కల్చర్ అండ్ క్రియేటివిటీ కమిషన్ విభాగం, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ సహకారంతో తెలుగు వరల్డ్ ఆర్టిస్ట్స్ ఆర్ట్ సోసైటీ (టి.డబ్ల్యూ.ఎ.ఎ.ఎస్) ఆధ్వర్యంలో జరగబోయే 4వ చిత్రకళా సంత పోస్టర్ ను సోమవారం ఎంపీ కేశినేని శివనాథ్ ఆవిష్కరించారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం, ఎన్టీఆర్ భవన్ లో ఎంపీ కేశినేని శివనాథ్ ను టి.డబ్ల్యూ.ఎ.ఎ.ఎస్ జనరల్ సెక్రటరీ బాలయోగి తో పాటు సోసైటీ సభ్యులు కలిశారు.

చిత్రకళకారులకు ప్రోత్సహంతో పాటు మార్కెట్ కల్పించటానికి చిత్ర కళా సంతను డిసెంబర్ 14 వ తేదీ బందర్ రోడ్డ్ లోని దూరదర్శన్ అండ్ టీటీడీ కళ్యాణ మండపం రోడ్డులో నిర్వహిస్తున్నట్లు ఎంపీ కేశినేని శివనాథ్ కు తెలిపారు. సామాన్యుల ఇంటిలో కూడా ఒక పెయింటింగ్ వుండాలనే ధ్యేయంతో చిత్ర కళకారులు తక్కువ ధరలకే పెయింటింగ్స్ ను అమ్మకానికి పెడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో టి.డబ్ల్యూ.ఎ.ఎ.ఎస్ ఉపాధ్యక్షులు టి.వెంకట రావు, ఎ.రాము, జాయింట్ సెక్రటరీ మురళీ కృష్ణ, కన్వీనర్ మీనాక్షి, ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## బాల గొండ ఆదినారాయణ కు ఘనంగా నివాళులు !



**అంకుశం న్యూస్ ధర్మవరం నవంబర్ 10:** రామగిరి మండలం పెనుబోలు గ్రామం ప్రముఖ రైతు బాల గొండ ఆదినారాయణ రెండవ వర్ధంతి సందర్భంగా ఆయనకు పలువురు ఆయన మిత్రులు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ధర్మవరం మండలం గొట్లూరు అనాధ ఆశ్రమం లో బాలగొండ్ల కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమం లో శ్రీ మతి సుబ్బమ్మ బాల గొండ మల్లికార్జున, బుట్రా నాగేంద్ర, అశోక్ కుమార్, హరినాథ్, మధుసూదన్, మల్లేశ్వరమ్మ బయమ్మ,హిమానుల్లా తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల నిర్మాణ నాణ్యతలో రాజీ పడొద్దు

**–ఎంపీడీఓ బి.విజయలక్ష్మి**



**రాప్తాడు, అంకుశం న్యూస్ నవంబర్ 10:** రోడ్ల నిర్మాణ నాణ్యతలో రాజీ పడొద్దని ఎంపీడీఓ బి.విజయలక్ష్మి అన్నారు. రాప్తాడు గ్రామపంచాయతీలో ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్లను టీడీపీ మండల కన్వీనర్ పంపు కొండప్ప, సర్పంచ్ సాకే తిరుపాలు, డిప్యూటీ ఎంపీడీఓ అశోక్ బాబు, పీఆర్ జేఈ కిషోర్, ఆర్.డబ్ల్యూ.ఎస్. జేఈ వరలక్ష్మి, కాంట్రాక్టర్ సోమర నారాయణస్వామితో కలిసి పరిశీలించారు. పంచాయతీ అభివృద్ధికి ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయడం హర్షనీయమని ఎంపీడీఓ అన్నారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ తలారి శివ, తలారి నాగరాజు, వర్క్ ఇన్స్పెక్టర్ బాబు ఉన్నారు.

## రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు మాంటిస్సోరి ఎలీట్ విద్యార్థులు








**రాప్తాడు, అంకుశం న్యూస్ నవంబర్ 11:** ప్రకాశం జిల్లాలో ఈ నెల 23, 24, 25 తేదీలలో జరుగనున్న రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ క్రీడాపోటీలకు అనంతపురం జిల్లా రాప్తాడు మండలం మాంటిస్సోరి ఎలీట్ విద్యార్థులు పవన్ తేజు, రక్షిత, గురువర్షిణి, లిఖిత్ లు ఎంపికైనట్లు .డి కృష్ణ భరత్, కరస్పాడెంట్ కృష్ణ సమీర సోమవారం తెలిపారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో ఆదివారం జరిగిన క్రీడాపోటీలలో అండర్-14 కేటగిరీలో 8వ తరగతి చదువుతున్న పవన్ తేజు, రక్షిత, 10వ తరగతి చదువుతున్న గురువర్షిణి, 11వ తరగతి చదువుతున్న లిఖిత్ అండర్ -19 కేటగిరిలో హ్యాండ్ బాల్ పోటీలలో అత్యుత్తమ ప్రదర్శన కనబరచడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఎం.డి, కరస్పాడెంట్ తోపాటు ప్రిన్సిపాల్ ప్రతాప్ రెడ్డి అభినందించారు. అదేవిధంగా విద్యార్థులను మెరికల్లా తీర్చిదిద్దిన కోచ్ ఉదయ్ ను అభినందించారు.

## 11న పెనుగొండ, హిందూపూర్ పారిశ్రామిక వాడలలో పరిశ్రమలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చే వర్చువల్ గా భూమి పూజ

**– జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్**



**అంకుశం న్యూస్ పుట్టపర్తి నవంబర్ 10:** 30వ పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు - 2025 లో భాగంగా... ఈనెల 11న పెనుగొండ, హిందూపూర్ పారిశ్రామిక వాడలలో పరిశ్రమలకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చే వర్చువల్ గా భూమిపూజ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆధ్వర్యంలో ఈ నెల 11న ఉదయం 10.30 గంటలకు ప్రకాశం జిల్లా కనిగిరిలో 30వ పారిశ్రామిక భాగస్వామ్య సదస్సు - 2025 ప్రోగ్రాం ప్రారంభించటం జరుగుతుందని, ఈ సందర్భంగా అక్కడి నుండి వర్చువల్ గా అనేక నూతన పరిశ్రమలకు సంబందించి భూమి పూజ మరియు ప్రారంభోత్సవ కార్యక్రమం చేపట్టడం జరుగుతోందన్నారు. ఇందులో భాగంగా శ్రీ సత్య సాయి జిల్లా పెనుకొండ నియోజక వర్గంలోని అమ్మవారి పల్లి పారిశ్రామిక వాడలో పిహెచ్ఏ (%ూనాూ%)ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ నందు మరియు హిందూపూర్ నియోజగవర్గంలోని తూమ కుంట పారిశ్రామిక వాడలోని హెచ్.టి.ఎల్ (%ఋూ%) మెటల్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల యందు భూమి పూజ కార్యక్రమం నిర్వహించటం జరుగుతుందన్నారు. పెనుకొండ నియోజకవర్గ కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి మంత్రి అనగాని సత్య ప్రసాద్ , జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ గారు, హిందూపురం పార్లమెంట్ సభ్యులు బి. కే పార్థ సారధి , ఇతర ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొంటారని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.